క్షోభంలోనూ సంక్షేమం



కోగిర సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత



ఇది మంచి ప్రభుత్వం పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ముందుకు

బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

కోగిరలో 'ఇది మంచి ప్రభుత్వం'లో పాల్గొన్న మంత్రి

పెనుకొండ రూరల్/ పుట్టపర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సంక్షోభం లోనూ సంక్షేమం అందిస్తూ, వంద రోజుల్లో ప్రజల చేత ఇది మంచి ప్రభుత్వం అని తమ ప్రభుత్వం నిరూపించుకుందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె ఎమ్మెల్యేలు, కూటమి నాయకులతో కలిసి వంద రోజుల పాలనలో సాధించిన విజయాలపై ఇంటింటికి తిరిగి వివరించారు. రొద్దం మండలం కోగిరలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో సాధించిన విజయాలు, అమలు పరిచిన సంక్షేమపై ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. ప్రజలు అధికారం ఇస్తే ఐదేళ్ల పాలనలో రంగులు వేయడం, బటన్ నొక్కడం తప్ప మరేం చేతగాని దద్దమ్మ జగన్మోహన్‌రెడ్డి అంటూ మాజీ ముఖ్యమంత్రిని విమర్శించారు. కనగానపల్లి మండలంలో పలు గ్రామాల్లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. కదిరి కరణం వీధిలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. అమడగూరు మండలం పూలకుంట్లపల్లిలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. మడకశిర మండలం ఆమిదాలగొంది గ్రామంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. హిందూపురంలో శ్రీకంఠపురం, ధర్మపురం, బోయపేటలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డె అంజినప్పతోపాటు టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన గురించి వివరించారు. జిల్లా వ్యాప్తంగా తొలి రోజు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో అట్టహాసంగా కొనసాగింది. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు శ్రేణులతోపాటు అధికారులు పాల్గొన్నారు.



దుదరగుట్టలో సీసీరోడ్డుకు భూమి పూజ చేస్తున్నఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



ఆమిదాలగొందిలో స్టిక్కర్లు, కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, తిప్పేస్వామి

దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలి

■ ఎస్పీ రత్న



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 20: దర్యాప్తు పెండింగ్ ఉన్న అట్రాసిటీ కేసులతో పాటు మిస్సింగ్ కేసులపై దృష్టి సారించి బాధి తులకు సకాలంలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ రత్న అధికారు లను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆమె జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుకొండ సబ్‌డివిజన్ పోలీసు అధికారులతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, మిస్సింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల దర్యాప్తును 60 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అభియోగపత్రాలను తయారు చేయడంలో న్యాయ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. సివిల్స్ రైట్స్‌డే ద్వారా ఎస్సీ ఎస్టీ కాలనీల్లో గ్రామ సభలు నిర్వహించి వారికి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. బాలికలు, మహిళలు, యువకుల మిస్సింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి అదృశ్యమైన వారి జాడ తెలుసుకోవాలని సూచించారు. పోక్సో కేసుల పెండింగ్‌కు గల కారణాలను ఆరాతీశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు కేవీ మహేష్, శ్రీనివాసులు, శివనారాయణస్వామి, డీటీఆర్‌బీసీ సీఐ సతీష్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉష శ్రీచరణ్ నాయకత్వం వద్దు

గోరంట్లలో వైసీపీ నాయకుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న వైసీపీ నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 20: మాజీ మంత్రి ఉష శ్రీచరణ్ నాయకత్వాన్ని నియోజకవర్గంలోని పలువురు నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఈక్రమంలోనే మాజీ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ వర్గీయులు గోరంట్లలోని సర్పంచ్ సరోజ నివాసంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శంకర్‌నారాయణ కూడా హాజరైనట్లు నాయకులు తెలిపారు. ఉష శ్రీచరణ్ నాయకత్వం వద్దంటూ సమావేశానికి హాజరైనవారంతా ముక్త కంఠంతో పేర్కొన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయాన్ని ఎన్నికల అనంతరం పూర్తిగా మూసివేశారని, ఇలాగైతే పార్టీకి పుట్టగతులుండవని పలువురు తెలిపారు. త్వరలో పార్టీ కార్యాలయాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అలాగే పెనుకొండ నియోజకవర్గ సమన్వయ కర్త(ఇన్‌చార్జి)ను మార్చాలంటూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇందుకోసం అధిష్టానంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. ఇదే విషయమై తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లి అధినేతతోనే చర్చిద్దామని పేర్కొన్నారు. పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా శంకర్‌నారాయణను నియమించాలని తీర్మానించారు. సమావేశంలో వైసీపీ నాయకులు నాగేనాయక్, కలిగేరి శంకర్‌రెడ్డి, కన్వీనర్లు లక్ష్మీనరసమ్మ, ధనుంజయ్‌రెడ్డి, నూరు మహ్మద్, నరసింహమూర్తి, రంగప్ప, నర్సిరెడ్డి, నాగభూషణరెడ్డి, కుటాల బాబు, శివమణి, రంగారెడ్డి, జబ్బార్, సుబహాన్ హాజరయ్యారు.

ధర్మవరం వాసికి బెస్ట్ వీవర్ అవార్డు

ధర్మవరం, సెప్టెంబరు 20: పట్టణానికి చెందిన జే. రామాంజనేయులుకు బెస్ట్ వీవర్ అవార్డు దక్కింది. సెంట్రల్ సిల్క్ బోర్డు 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మైసూర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆ అవార్డును రామాంజనేయులుకు అందజేశారు.



రామాంజనేయులుకు అవార్డు అందజేస్తున్న కేంద్రమంత్రి

కొండంత టార్గెట్..!

మార్చికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశాలు.. చేయకపోతే చర్యలు తప్పవని ఉన్నతాధికారుల హెచ్చరిక

'వైసీపీ ఇళ్ల'కు బిల్లులు చేయొద్దంటున్న నాయకులు

అధికారులు, నాయకుల మధ్య నలుగుతున్న ఏఈలు

హిందూపురం, సెప్టెంబరు 20: క్షేత్రస్థాయిలో గృహనిర్మాణ పనులు పూర్తి కాక ఒకవైపు, ఉన్నతాధికారులు విధించిన టార్గెట్ చేరలేక మరోవైపు హౌసింగ్ అధికారులు సతమతమవుతున్నారు. 2019-24 మధ్య కాలంలో మంజూరై ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేయాలని, లేదంటే ఆ ఇళ్లు రద్దు చేయాలని ఉన్నతాధికారులు స్థానిక అధికారులకు టార్గెట్ విధించారు. ఈక్రమంలోనే ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేసేందుకు క్షేత్రస్థాయికి వెళ్తున్న హౌసింగ్ అధికారులకు కూటమి నాయకుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 2016-2019 వరకు ఎన్టీఆర్ పథకం కింద ఇల్లు నిర్మించుకున్న వారికి బిల్లులు చెల్లించిన తరువాతే వైసీపీ హయాంలో నిర్మించుకున్న వారికి బిల్లులు మంజూరు చేయాలని వారు హెచ్చరిస్తున్నారు. దీంతో హౌసింగ్ అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. జిల్లా వ్యాప్తంగా 2019నుంచి 2024వరకు జగనన్న లేఅవుట్ల కింద సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.72,353ఇళ్లు మంజూరుకాగా ఇప్పటి వరకు 22,756 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 49,597ఇళ్లు ఆరు నెలల లోపు పూర్తి చేయించాలని హౌసింగ్ ఉన్నతాధికారులు హుకుం జారీచేశారు. చేయని అధికారులు సస్పెండ్ అవుతారని హెచ్చరికలు చేస్తున్నారు. జిల్లాలో 2019నుంచి 2023వరకు చేపట్టిన గృహనిర్మాణాలకు సంబంధించి బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, వచ్చే మార్చికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ పరిస్థితుల్లో హౌసింగ్ అధికారులు తలలు బాదుకుంటున్నారు. ఐదేళ్ల కాలంలో 22వేల మాత్రమే నిర్మించుకుంటే వచ్చే ఆరు నెలల్లో 50వేల ఇళ్ల నిర్మాణాలు ఎలా జరుగుతాయని కొంతమంది అధికారులు బహిరంగంగా పేర్కొంటున్నారు.



ఒత్తిడి తాళలేక సెలవులో వెళ్లే యత్నం

వచ్చే మార్చికి జిల్లా వ్యాప్తంగా ఉన్న 50వేళ్ల ఇళ్లను పూర్తి చేయాలని, ప్రతి హౌసింగ్ ఏఈ రోజుకు పది ఇళ్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్ చే యలేమని చెబుతూ చాలా మంది హౌసింగ్ అధికారులు సెలవు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఎవరు టార్గెట్ పూర్తి చేయరో వారిని సస్పెండ్ చేస్తామంటూ రాష్ట్రస్థాయి అధికారులు మండల స్థాయి అధికారులను హెచ్చరిస్తున్నారు. దీంతో అధికారులు కొంతమంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి మంజూరైన గృహాన్ని నిర్మించుకోమని చెబుతుంటే వారు మాత్రం మేం నిర్మించుకునే పరిస్థితి లేదంటూ తెగేసి చెబుతున్నారు. మీరు చెప్పిన విధంగా ఇళ్లు నిర్మించుకోవడం సాధ్యం కాదని కొందరు లబ్ధిదారులు ఇంటి పట్టాలు వెనక్కు ఇచ్చేశారు. హిందూపురం మండలంలో సుమారు 300మంది ఇంటి పట్టాలు వెనక్కు ఇచ్చారు. మరి కొందరైతే కూటమి ప్రభుత్వం 2-3 సెంట్లు ఇస్తామని చెప్పింది కదా ఇప్పుడు ఇళ్లు నిర్మించుకుంటే అది అందకుండా పోయే ప్రమాదం ఉందని గృహనిర్మాణానికి ముందుకు రావడం లేదు. ఈక్రమంలో గత ప్రభుత్వంలో ఇచ్చిన సెంటు స్థలంలో ఇంటి నిర్మాణానికి ముందుకు రావడం లేదు.

కొటిపి వద్ద పునాదులకే పరిమితమైన ఇళ్లు



జిల్లాలో 23మంది ఏఈలకు షోకాజు నోటీసులు

ఉన్నతాధికారులు ఇచ్చిన హౌసింగ్ టార్గెట్ చేయని 23మంది ఏఈలకు ఉన్నతాధికారుల నుంచి షోకాజు నోటీసులు అందాయి. ఎందుకు మీరు జగనన్న లేఅవుట్‌కు సంబంధించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించలేకపోయారని చీవాట్లు పెట్టినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నారు.



ప్చ్.. ఇన్‌స్పైర్..!

పట్టించుకోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు

ప్రాజెక్టుల ప్రదర్శనకు ముందుకురాని వైనం.

ప్రభుత్వ పాఠశాలల నుంచే దరఖాస్తులు

ధర్మవరం, సెప్టెంబరు 20: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు.. విద్యార్థులను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారిలోని సృజనాత్మకతను వెలికితీసే కార్యక్రమాలకు దూరంగా ఉంచుతున్నాయన్నది బహిరంగ రహస్యమే. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మానక్ (విద్యావైజ్ఞానిక ప్రదర్శన)కు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి స్పందన కరువైంది. ప్రభుత్వ పాఠశాలల నుంచే దరఖాస్తులు వస్తున్నాయి. దీంతో ఇన్‌స్పైర్‌కు మొత్తంగా దరఖాస్తులు ఏటా తగ్గుతూ వస్తున్నాయి. ఇది విద్యాశాఖాధికారులను కలవరపరుస్తోంది. విద్యార్థుల బుర్రల్లో నూతన ఆలోచనలను రేకెత్తించాల్సిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బాధ్యతను విస్మరిస్తున్నాయి. అక్కడక్కడా ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు ఇన్‌స్పైర్ ప్రాజెక్టులకు దరఖాస్తులు చేసుకుంటున్నా.. ఎక్కువ భాగం ప్రభుత్వ బడులకు చెందినవారే ఉంటున్నట్లు తెలుస్తోంది.

గడువు పొడిగింపు

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఇన్‌స్పైర్ మానక్ విద్యావైజ్ఞానిక నమోదు గడువును అక్టోబరు 15వతేదీ వరకు పొడిగించింది. 2024-25 విద్యాసంవత్సరానికిగాను ఆన్‌లైన్‌లో విద్యార్థుల నుంచి ప్రతిపాదనల స్వీకరణ గడువు గత ఆదివారంతో ముగిసింది. ప్రాజెక్టు నమోదుకు ప్రభుత్వం మరో అవకాశం ఇస్తూ నమోదు గడువును పొడిగించింది. విద్యావైజ్ఞానిక శాస్త్ర సాంకేతిక ప్రదర్శన అంతరిక్ష, వైద్యఆరోగ్య, వ్యవసాయ రంగాల వారీగా ఆవిష్కరణలకు దోహదం చేసే సమగ్ర నివేదికను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి 5, ప్రాథమిక పాఠశాలల నుంచి 3 చొప్పున విద్యార్థులతో ప్రాజెక్టు నివేదికలను రూపొందించాలి. ఇందుకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించేందుకు సైన్స్ ఉపాధ్యాయులకు బాధ్యత అప్పగించాలి. ఎంపికైన విద్యార్థులకు ప్రాజెక్టుల తయారీకి కేంద్ర ప్రభుత్వం రూ.10వేలు చొప్పున అందజేయనుంది. ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఎంచుకున్న ప్రాజెక్టు పేరు, దాని వల్ల సమాజానికి ఒనగూరే అంశాలతో నివేదికను గైడ్ టీచర్ సాయంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

అన్ని పాఠశాలలు నిర్వహించాలి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఇన్‌స్పైర్ మానక్‌కు దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థుల సృజనాత్మకతను శాస్త్రసాంకేతిక విజ్ఞానాన్ని వెలికితీయడానికి ఇన్‌స్పైర్ కార్యక్రమాన్ని ఎంతో కీలకం. అక్టోబరు 15లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

- మీనాక్షి,
డీఈఓ

నత్తనడకన రిజిస్ట్రేషన్లు

ఇన్‌స్పైర్‌కు స్పందన కరువైంది. ప్రదర్శనల రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగుతున్నాయి. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు.. విద్యార్థులకు అవగాహన కల్పించకపోవడమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 310 మంది ఇన్‌స్పైర్‌కు నమోదు చేసుకున్నట్లు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే అధికంగా ఉన్నట్లు సమాచారం.

విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న డీఈఓ (ఫైల్)



హిందీకి విస్తృత ప్రచారం కల్పిద్దాం: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 20: రాజభాషగా పిలువబడే హిందీ భాషకు విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి సవిత అన్నారు. శుక్రవారం పెనుకొండ ఆర్యవైశ్య కల్యాణమండపంలో హిందీ భాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులను సన్మానించి మెమెంటో అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశ భక్తిని పెంపొందించడంలో హిందీ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్రస్థాయిలో మాతృభాషలను కాపాడుకుంటే జాతీయ స్థాయిలో హిందీభాష కనుమరుగు కాకుండా రక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రవిశంకర్‌గురూజీ, ఎంఈఓ చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, యూటీఎఫ్ సుధాకర్, హిందీ ఉపాధ్యాయులు గాయిత్రి, గౌసియా, మల్లిక, జాబిలి చాంద్‌బాషా, జహీర పాల్గొన్నారు.



మంత్రితో హిందీ ఉపాధ్యాయులు

తిరుమల పవిత్రతను మంటగలిపిన జగన్

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, సెప్టెంబరు 20: తిరుమల పవిత్రతను మంటగలిపిన దుర్మార్గుడు వైసీపీ అధినేత జగన్ అని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మండిపడ్డారు. తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో పట్టణంలోని అమరాపురం బస్టాండులో శుక్రవారం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలోని వెంకన్న భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసిన అవినీతి జగన్ శిక్ష అనుభవించక తప్పదన్నారు. గుజరాత్ ల్యాబ్‌లోని నమూనా రిపోర్టులు వచ్చిన తరువాత ఎంతో మంది భక్తుల ఆరాధ్యదైవమైన వెంకన్న ప్రసాదాన్ని అపవిత్రం చేశారన్న బాధతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడితే తన తప్పును కప్పి పుచ్చుకోవడానికి ఎదురుదాడి చేస్తుండటం జగన్ నీచత్వానికి పరాకాష్ట అన్నారు. జగన్‌కు ఇతర మతాలన్నా, సంస్కృతులు అన్నా నమ్మకాలు లేవని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్న సమయంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరం అన్నారు. చంద్రబాబు ఎన్నికల హామీ మేరకు పెన్షన్ రూ.4వేలు, డీఎస్సీ నోటిఫికేషన్, అన్న క్యాంటిన్‌లు, దీపావళికి ఉచిత సిలిండర్లు, సంక్రాంతికి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇలా అన్ని హామీలను అమలు చేస్తారన్నారు. వైసీపీ పాలన అంతా అవినీతి మయం అని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, సాధికారత కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, డాక్టర్ సెల్ నాయకులు డాక్టర్ కృష్ణమూర్తి, నాయకులు నరసింహరాజు, భక్తర్, తిమ్మరాజు, ఉమాశంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

రేపు గుడ్డం ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 20: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన గుడ్డం రంగనాథస్వామి ఆలయం వద్ద ఆదివారం గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నాగేంద్రుడు, ఆలయ అర్చకుడు గోవిందశర్మ, శ్రీమన్నారాయణ దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6.40 నిమిషాలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బ్రాండెడ్..!

- దుకాణాల్లో దొరకని నాణ్యమైన మద్యం
- పక్కదారి పట్టిస్తున్న సిబ్బంది



మద్యం ప్రియులు లేక ఖాళీగా ఉన్న షాపు

ఉరవకొండ, సెప్టెంబరు 20: దుకాణాల్లో అవసరమైన బ్రాండ్లు లేవని మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో వెళ్లినా డిస్ప్లేలో ఉన్న బ్రాండ్లు మాత్రమే మా దగ్గర ఉన్నాయి. బీర్లు అసలే లేవని దుకాణాల్లో పని చేసే సిబ్బంది సమాధానమిస్తున్నారు. బ్రాండ్లు ఏమీ లేనపుడు దుకాణాలను మూసివేస్తే సరిపోతుంది కదా అంటూ మందుబాబులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉరవకొండ మండల పరిధిలో ఉన్న నాలుగు మద్యం దుకాణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అక్టోబరు 1నుంచి అమలు కానుంది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలు తొలగించి పాత పద్ధతిలో ప్రైవేట్‌కు అప్పగించనున్నారు. దీంతో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండేది కొన్నిరోజులేనని భావిస్తూ, అక్కడున్న సిబ్బంది చేతి వాటం చూపి, ఎక్కువ డిమాండ్ ఉన్న బ్రాండ్లు మాయం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బంది అంతా వైసీపీతో అంటకాగిన వారే కావడంతో ఆ పార్టీకి సంబంధించిన వారికే బ్రాండ్ మద్యం అమ్ముతున్నట్లు బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. బ్రాండెడ్ మద్యం దొరక్క పోవడంతో మద్యం ప్రియులు బార్‌ల వైపు పరుగులు పెడుతున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ కిషోర్‌ని వివరణ కోరగా, మద్యం దుకాణాల్లో బ్రాండ్లు ఉన్నా అమ్మకపోతే అలాంటి వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు.

భార్యాభర్తల వైద్యం..

విద్యార్థికి సంకటం

- జ్వరానికి వైద్యం చేసిన మహిళా డాక్టర్
- సూదిమందు వేసిన ఆమె భర్త
- ఇన్‌ఫెక్షన్ అయ్యి ఆపరేషన్‌కు దారితీసిన పరిస్థితి



మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 20: జ్వరం అని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే అక్కడ మహిళా డాక్టర్, ఆమె భర్త చేసిన వైద్యంతో ఓ విద్యార్థి తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. ఈ ఘటన జిల్లాకేంద్రంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కళ్యాణదుర్గం మండలం మాండ్రేవ్ గ్రామానికి చెందిన ప్రవీణ్ నగరంలోని సంగమేష్ నగర్‌లో ఉంటూ ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 17న అతడికి జ్వరం రావడంతో తన నివాసానికి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ డాక్టర్ సుహాసిని పరీక్షించి సూది, మందులు రాసిచ్చింది. ఆమె రాసిచ్చిన ఇంజక్షన్‌ను డాక్టర్ గానీ డాక్టర్ అయిన ఆమె భర్త ఆ విద్యార్థికి వేశాడు. మరుసటిరోజు సూది వేసిన ప్రాంతంలో నొప్పి ప్రారంభం అయింది. ఆ రోజంతా నొప్పిని అలాగే భరించినా తగ్గకపోవడంతో గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు వెళ్లే ప్రాంతంలో ఉన్న మరో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నాడు. అక్కడ డాక్టర్ పరీక్షించి, ఇన్‌ఫెక్షన్ అయిందని చెప్పారు. అక్కడ సూది వేసారు సార్..! అదేకారణమా? అని ఆరాతీయగా ఆడాక్టర్ అవునని చెప్పాడు. అలాగే వదిలేస్తే మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పడంతో శుక్రవారం ఆపరేషన్ చేసి ఇన్‌ఫెక్షన్ తొలగించారు. ఇప్పటికే రూ.30 వేలు ఖర్చు అయ్యింది. పేద కుటుంబం కావడంతో డబ్బుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వచ్చీరాని వ్యక్తి సూది వేయడం వల్లే ఇలా జరిగిందని విషయాన్ని విద్యార్థి సంఘాల నాయకులు దృష్టికి బాధితులు తీసుకెళ్లారు. దీంతో వాళ్లు సూది వేసిన డాక్టర్ వద్దకు వెళ్లి విషయం చెప్పారు. కానీ ఆడాక్టరమ్మ మాకేమి సంబంధంలేదడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. బాధితులకు న్యాయం చేయాలని కోరినా ఆ మహిళా డాక్టర్ సమ్మతించలేదు. దీంతో ఈ విషయంపై కలెక్టరు, డీఎంహెచ్ఓలకు ఫిర్యాదు చేయనున్నట్లు విద్యార్థి సంఘం నాయకుడు సూర్యచంద్ర యాదవ్ తెలిపారు.

వైసీపీ నాయకుడి నుంచి రక్షణ కల్పించండి

- జిల్లా ఎస్పీని కలిసిన దేవగిరి గ్రామస్థులు



ఎస్పీని కలిసి బయటకు వస్తున్న దేవగిరి గ్రామస్థులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 20: మండలంలోని దేవగిరి గ్రామానికి చెందిన సర్పంచ్ రాధిక భర్త, వైసీపీ నాయకుడు రాజ్‌కుమార్ నుంచి తమకు రక్షణ కల్పించాలని దేవగిరి గ్రామానికి చెందిన పలమనేరు సుబ్బరాయుడు, అప్పారావు, గోవింద, సుంకన్న, త్రినాథ్ తదితరులు శుక్రవారం జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు భూములను కబ్జా చేసి, అక్రమ కేసులు బనాయించి, తీసుకున్న అప్పులు చెల్లించకుండా, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించకుండా దౌర్జన్యానికి పాల్పడ్డాడని ఎస్పీకి వివరించారు. సుంకన్న వ్యవసాయ మోటార్‌కు విద్యుత్ లైన్ తీసుకెళ్లకుండా అడ్డుకున్నారని, ఆర్‌బీకేలో రైతు భరోసాపై అడిగేందుకు వెళితే అక్రమ కేసులు బనాయించారని గోవిందు ఎస్పీకి తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నపుడు కొండ పోరంబోకు భూమిని దౌర్జన్యంగా కబ్జా చేసి కంచె వేసుకున్నాడని పలమనేరు సుబ్బరాయుడు తెలిపారు. కాంట్రాక్ట్ పనుల బిల్లులు తన ఖాతాలోకి మళ్లించుకుని ఇవ్వకుండా వేధిస్తున్నాడని త్రినాథ్ తెలిపారు. గ్రామంలో రాజ్‌కుమార్ అరాచకాలు మితిమీరాయని వైసీపీ అధికారంలో ఉన్నపుడు బండారు ఎర్రితాత కుటుంబ సభ్యులను వారంరోజుల పాటు గ్రామ బహిష్కరణ చేయించారని, వలంటీర్లతో అక్రమ కేసులు బనాయించడం, ఇప్పటికీ తామే సర్పంచ్‌గా ఉన్నామని, తమ మాటే చెల్లుతుందని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వారు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కోరినట్లు వారు తెలిపారు.

కృత్రిమ డిమాండ్ సృష్టిస్తే చర్యలు

విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య



అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 20: జిల్లాలో ఆయిల్స్‌పై కృత్రిమ డిమాండ్ సృష్టిస్తే సహించేదిలేదని విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలోని తమ చాంబర్‌లో ఆయన పలు విషయాలను వెల్లడించారు. వంటకు వినియోగించే నూనెల్లో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు నిల్వచేసుకొని లేబుల్ ట్యాంపరింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టోరేజ్ పరిమితికి అనుగుణంగానే నిల్వ చేసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించి తమ సిబ్బంది తనిఖీల్లో పట్టుపడితే చర్యలు తప్పవన్నారు. డంప్ స్టోరేజ్‌పై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. 5 శాతం చెల్లించాల్సిన ట్యాక్స్ విషయంలో కూడా నిబంధనలను అతిక్రమించినట్లు పలుచోట్ల తనిఖీల్లో బయటపడిందని అన్నారు. ఎమ్మార్పీ లేబుల్ ట్యాంపరింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఎక్కడైనా కల్తీలకు సంబంధించి గాని, నాణ్యత, తూకాలు సరిగా లేకపోవడంపై తమ కార్యాలయం ఫోన్ నెంబరు 8554-241249 కు వివరాలు చెప్పవచ్చు అన్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి

- సమ సమాజ స్థాపనకు తపించారు
- ఆయన ఆశయాలు సాధిద్దాం
- సంతాప సభలో రాజకీయ, ప్రజా సంఘాల నేతలు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 20: సమాజంలోని స్వార్థ రాజకీయాలు, ఆర్థిక అసమానతలు, శ్రమదోపిడీ, కార్పొరేట్ సంస్థల దోపిడీని రూపుమాపేందుకు నిర్విరామ పోరాటం చేసిన యోధుడు సీతారాం ఏచూరి అని ప్రజాప్రతినిధులు, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని లలితకళాపరిషత్‌లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభ నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అధ్యక్షతన నిర్వహించిన సభకు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతోపాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ సీతారాం ఏచూరి బహుబాషా పరిజ్ఞానం కలిగిన గొప్ప నాయకుడన్నారు. ఢిల్లీలో దక్షిణ భారతదేశం పార్లమెంటేరియన్ల పట్ల చులకనభావం, చిన్నచూపు నెలకొన్న పరిస్థితుల్లో తెలుగువాడైన ఏచూరి ప్రతిభతో ఆ సంస్కృతిని అంతమొందించి ఆదర్శవంతుడిగా నిలిచారని అన్నారు. నూతన ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశానికి జరిగే ఉపయోగాలకన్నా నష్టాలు అధికంగా ఉన్న విషయాన్ని తెలియజేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఎందరో జీవితాలకు స్ఫూర్తిగా నిలిచారని, అందులో తానుకూడా ఉన్నానని అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆదర్శమైన రాజకీయాలను ప్రభావితం చేసిన నాయకుడు ఏచూరి అన్నారు. సిద్ధాంత పరంగా విభేదించినా ప్రజలకు అవసరమైన, ఉపయోగకరమైన అంశాలను ఏచూరి స్వాగతించేవారని, ఉపాధి హామీ పథకం అమలులో అప్పటి యూపీఏ ప్రభుత్వానికి ఎంతో సహకరించారని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేశం ఎన్నో గొప్ప సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ప్రజాగొంతుక ఏచూరిని కోల్పోవడం బాధాకరమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ఏచూరి తుదిశ్వాస వరకూ సమాజం కోసమే జీవించారన్నారు. ఆయన పార్థివ దేహాన్ని సైతం వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలనే దృఢనిశ్చయంతో సమర్పించిన గొప్ప వామపక్ష యోధుడని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ పేదలు, కర్షకులు, ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన త్యాగమూర్తి సీతారాం అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఓబులు మాట్లాడుతూ నిర్దిష్టమైన సిద్ధాంత అనుసంధానకర్తగా ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ ఏచూరి చూపిన మార్గంలో తామంతా నడుస్తామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం, వివిధ రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు, ప్రముఖులు ఇంతియాజ్, రాఘవేంద్ర, ఏసురత్నం, చంద్రశేఖర్, వెంకటసుబ్బయ్య, పద్మజ, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ ప్రసూన, పెద్దన్న, డాక్టర్ భానుకిరణ్, నల్లప్ప, నాగేంద్రకుమార్, ఎస్ఎం బాషా, షేకన్న, కేవీ రమణ, గోవిందరాజులు, కంబదూరి నబిరసూల్, తరిమెల అమర్నాథరెడ్డి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



ఏచూరి సంతాపసభకు పెద్దఎత్తున హాజరైన జనం



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంజు.. ఈశ్వరన్ శతకాలు

- నిరాశపరిచిన సూర్య కుమార్
- ఐదు వికెట్లు కూల్చిన నవదీప్ సైనీ
- ఆసక్తికరంగా రెండో రోజు మ్యాచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20: స్టార్ బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్ బ్యాట్‌తో రెచ్చిపోతే చూడాలని ఆశించిన అనంత క్రీడాభిమానులకు నిరాశే ఎదురైంది. కేవలం ఐదు పరుగులకే 'స్కై' పెవిలియన్‌కు చేరింది. సంజు శ్యాంసన్, అభిమన్యు ఈశ్వరన్ సెంచరీలతో అలరించారు. ఏసీజీ-ఎ, బి మైదానాలలో దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు రెండో రోజు కొనసాగాయి. ఓవర్ నైట్ స్కోర్ 224-7తో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇండియా-ఎ జట్టు రెండో రోజు శుక్రవారం మరో 73 పరుగులు జోడించి 297 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 122 పరుగులతో ఇన్నింగ్స్ ఆరంభించిన శశావత్‌రావత్ రెండు పరుగులు మాత్రమే జోడించి 124 పరుగులకు ఔట్ అయ్యారు. మరో బ్యాట్స్‌మన్ ఆవేశ్‌ఖాన్ 16 పరుగులతో ఆరంభించి అర్ధ సెంచరీ పూర్తి చేసి అవుట్ అయ్యారు. ప్రసిద్ధ్ కృష్ణ 34 పరుగులు సాధించగా, ఆఖీబ్‌ఖాన్ డకౌట్ అయ్యారు. ఇండియా-సి బౌలర్లలో వైశాక్ విజయ్‌కుమార్ 4 వికెట్లు, అన్షుల్ కాంబోజ్ 3 వికెట్లు, గౌరవ్ యాదవ్ 2 వికెట్లు పడగొట్టారు. ఆ తరువాత మొదటి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇండియా-సి జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 64 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్ 17 పరుగులు, సాయి సుదర్శన్ 17 పరుగులు చేశారు. రజిత్ పటిదార్ డకౌట్ కాగా, ఇషాన్ కిషన్ 5, మానవ్‌సుతార్ 2, అన్షుల్ కాంబోజ్ ఒక పరుగు చేశారు. బాబా ఇంద్రజిత్ 34 పరుగులతో రిటైర్డ్ హర్ట్ అయ్యారు. అభిషేక్ పోరెల్ 82 పరుగులు సాధించారు. పల్కిట్ నారంగ్ 35 పరుగులు, వైశాక్ 14 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఇండియా-ఎ బౌలర్లలో ఆఖీబ్‌ఖాన్ 3 వికెట్లు, శాంష్ ములాని 2 వికెట్లు, ఆవేష్ ఖాన్, తనుష్ కొటియాన్ చెరో వికెట్ తీశారు.



అభిమానులను నిరాశపరిచిన సూర్యకుమార్ యాదవ్



ఐదు వికెట్లుతో రాణించిన నవదీప్‌సైనీ



సూర్యకుమార్‌ను ఔట్ చేసిన ఆనందంలో ఇండియా ఏ జట్టు ఆటగాళ్లు



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, మాంచోఫెర్రర్





క్రికెట్ పోటీలను ఆస్వాదిస్తున్న విద్యార్థులు

స్కై ఫెయిల్యూర్..

ఓవర్ నైట్ స్కోర్ 306-5తో రెండో ఆట ఆరంభించిన ఇండియా-డి జట్టు 349 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో రోజు 89 పరుగులతో ఇన్నింగ్స్ ఆరంభించిన సంజు శ్యాంసన్ 106 పరుగులు సాధించారు. నవదీప్‌సైని బౌలింగ్‌లో నితీష్‌కుమార్ రెడ్డికి క్యాచ్ ఇచ్చి వెనుతిరిగారు. శరాన్ష్ జైన్ మరో 4పరుగులు జోడించి 26 పరుగులకు ఔటయ్యారు. సౌరభకుమార్ 13 పరుగులు, అర్షదీప్ సింగ్ 11 పరుగులు చేయగా, ఆకాష్‌సేన్ గుప్తా డకౌట్ అయ్యారు. ఇండియా-బి బౌలర్లు నవదీప్‌సైనీ 5 వికెట్లు, రాహుల్ చాహర్ 3 వికెట్లు, ముకేష్‌కుమార్ ఒక వికెట్ తీశారు. ఇండియా-బి మొదటి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ 170 బంతుల్లో 13 బౌండరీలు, ఒక సిక్సర్ సాయంతో మరోసారి బాధ్యాయుతంగా ఆడి 116 సాధించారు. మరో ఓపెనర్ జగదీషన్ 13 పరుగులు, సుయాష్ ప్రభుదేశాయ్ 16 పరుగులు చేశారు. జట్టులోకి చేరిన స్టార్ బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్ (5) నిరాశ పరిచారు. ముషీర్‌ఖాన్ 5 పరుగులు సాధించగా, నితీష్‌కుమార్ రెడ్డి డకౌట్ అయ్యారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-బి జట్టు 58 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 210 పరుగులు సాధించింది. వాషింగ్టన్ సుందర్ (39), రాహుల్ చాహర్ (0) క్రీజులో ఉన్నారు. ఇండియా-డి బౌలర్లలో అర్షదీప్ సింగ్ 3 వికెట్లు, ఠాకరే 2, సౌరభ్‌కుమార్ ఒక వికెట్ తీసుకున్నారు. దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ పోటీలను తిలకించారు.



అభివాదం చేస్తున్న అభిమన్యు

సిఫార్సులకు అగ్రతాంబూలం

'పంచాయతీ' బదిలీల కసరత్తు పూర్తి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 20: ఉమ్మడి జిల్లాలో పంచాయతీల బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు ముగించారు. పంచాయితీ కార్యదర్శుల బదిలీలకు సంబంధించి అనంతపురం, పుట్టపర్తి డీపీఓలు ప్రభాకర్‌రావు, విజయ్‌కుమార్, డీఎల్‌పీఓలు సుమనజయంతి, శివకుమారి శుక్రవారం ఉదయం నుంచి కసరత్తు చేసి ఎట్టకేలకు జాబితాను ఫైనల్ చేశారు. బదిలీల్లో సిఫార్సులకే పెద్ద పీట వేశారన్న ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలోని 1044 పంచాయతీలకు సంబంధించి సీనియార్టీకి అనుగుణంగా క్లస్టర్లకు సీనియర్లను నియమించి, ప్రతి పంచాయతీకి కార్యదర్శి ఉండేలా ప్రక్రియ ముగించినట్లు సమాచారం. అధికారులను సంప్రదించి తమకు కోరిన పంచాయతీ కావాలని విన్నవించుకున్నవారికి సైతనం.. స్థానిక నాయకుల నుంచి సిపార్సు లెటర్ ఉండాల్సిందేనని ఉన్నతాధికారులు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో చేసేది లేక తమకు ఉన్న పరిచయాలతో నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పలేదని పలువురు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలే కాకుండా వారి కుటుంబ సభ్యుల భాగస్వామ్యం కూడా ఉండడంతో పరిస్థితి ప్రశ్నార్థకరంగా మారింది. ఎమ్మెల్యే మొదట లెటర్ ఇచ్చిన వారి పేర్లు సైతం చివరి నిమిషంలో గల్లంతయ్యాయి. తాజాగా ఎవరు సిపార్సు లేఖ ఇస్తే వారికి బెర్త్ ఖరారు చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శనివారం జాబితా ప్రకటిస్తే కానీ ఎవరికి ఏ స్థానం దక్కిందో తెలుస్తుంది.

టీడీపీ నాయకుడిపై కేసు

హిందూపురం, సెప్టెంబరు 20: సచివాలయ ఉద్యోగితో ఫోన్‌లో దుర్భాషలాడి బెదిరించిన టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి శాసనకోట వెంకటేశ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. రెండు రోజుల క్రితం శాసనకోటకు చెందిన గ్రామ సచివాలయ కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డితో ఉలవల పంపిణీపై ఫోన్‌లో దుర్భాషలాడాడు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శుక్రవారం వెంకటేశ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. 353(1), బీఎన్ఎస్ 92(ఎ), డిసెబులిటి యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పరిగి ఎస్ఐ రంగడు తెలిపారు.

జిల్లా రిజిస్ట్రార్ కొనసాగింపు

పుట్టపర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారిని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖలో పలు జిల్లాల రిజిస్ట్రార్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. కృష్ణకుమారిని శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీచేసింది. తాజాగా కృష్ణకుమారిని జిల్లా రిజిస్ట్రార్‌గా కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు.

అన్నదాతలను ఆదుకోవాలి

- అధికారులకు జడ్పీ చైర్‌పర్సన్ ఆదేశం
- ముగిసిన స్టాండింగ్ కమిటీ సమావేశాలు



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజ

అనంతపురం విద్య, సెప్టెంబరు 20: అడవి జంతువుల దాడితో పంటలు నష్టపోతున్న అన్నదాతలను ఆదుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జడ్పీలోని సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ గిరిజ అధ్యక్షతన, సీఈఓ ఓబులమ్మ ఆధ్వర్యంలో ఏడు స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. కొందరు సభ్యులు మాట్లాడుతూ... రొద్దం, లేపాక్షి, తదితర ప్రాంతాల్లో అడవి పందుల దాడి ఎక్కువగా ఉందని, మొక్కజొన్నలు తినేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. రైతులకు మేలు చేసేలా ఏమి చర్యలు తీసుకుంటారని చైర్‌పర్సన్ అధికారులను ప్రశ్నించారు. అటవీ శాఖాధికారులు స్పందిస్తూ.....అడవి జంతువుల వల్ల పంట నష్టపోయిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని, దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ విషయం తమకే తెలియదని, ఇక రైతులకేం తెలుస్తుందని పలువురు సభ్యులు పేర్కొన్నారు. జడ్పీ చైర్సన్ కలుగజేసుకుని ఈ అంశంపై కరపత్రాల ద్వారా విస్తృతమైన ప్రచారం కల్పించాలని, చైతన్యం తేవాలని సూచించారు. గతంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మంజూరైన పనులు కొన్ని తీర్మానాలు లేక ఆగిపోయాయని, మరికొన్ని సగంలో ఉంటే...కొన్ని పూర్తయ్యాయన్నారు. బిల్లులు వస్తాయా..రావా అనే సందేహం చాలా మందిలో ఉండిపోయిందన్నారు. దీనికి సీఈఓ, ఇంజనీర్లు మాట్లాడుతూ.. పనులు పూర్తయితే...తప్పకుండా చెల్లిస్తారంటూ హామీ ఇచ్చారు. ఉరవకొండ, బుక్కరాయసముద్రం ప్రాంతాల్లో ఇంకుడు గుంతల పనులకు బిల్లులు చెల్లించాలని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సభ్యులు కోరారు. తర్వాత అంగన్‌వాడీల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



హాజరైన జడ్పీటీసీ సభ్యులు, అధికారులు

వైసీపీ నాయకుడిపై చీటింగ్ కేసు

కదిరి, సెప్టెంబరు 20: సాధారణ ఎన్నికల్లో కదిరి నుంచి పోటీ చేసి ఓడిపోయిన వైసీపీ అభ్యర్థి బీఎస్ మగ్బూల్ అహ్మద్‌పై పోలీసులు చీటింగ్, ఫోర్జరీ, పత్రాల మార్పిడి నేరాల కింద కేసు నమోదు చేశారు. మగ్బూల్‌తోపాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశామని కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. కడప జిల్లా పులివెందులకు చెందిన బీవీ రమణారెడ్డి కదిరిలో నివసిస్తున్నారు. 2005లో కదిరిలోని ఓ చర్చి స్థలాన్ని బత్తలపల్లికి చెందిన పీటర్‌పాల్, కదిరికి చెందిన పరికి షామీర్, అర్షాద్, మహమ్మద్ ముస్తఫా, ఎస్.ముస్తఫాతో కలిసి రమణారెడ్డి రూ.20 లక్షలకు కొనుగోలు చేశారు. చర్చివారికి అడ్వాన్సుగా రూ.18 లక్షలు చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నారు. ఆ తరువాత స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించేందుకు చర్చివారు నిరాకరించారు. దీంతో కొనుదారులు అనంతపురం కోర్టును ఆశ్రయించారు. విచారించిన కోర్టు, కొనులుదారులకు 2007లో అనంతపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చింది. ఆ తరువాత రమణారెడ్డికి తెలియకుండా మిగిలిన ఐదుగురు ఆ స్థలాన్ని హిందూపురానికి చెందిన హిదయతుల్లా అనే వ్యక్తికి 2008లో విక్రయించారు. రమణారెడ్డి పేరును ఫోర్జరీ చేశారు. కదిరికి చెందిన లక్ష్మీనారాయణ, గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మక్బూల్ అహ్మద్ అన్ని విషయాలు తెలిసీ సాక్షులుగా సంతకం చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ అని తెలిసి డాక్యుమెంట్ రైటర్ సలీంబాషా డాక్యుమెంట్‌ను రాశాడు. దీంతో బాధితుడు రమణారెడ్డి తన భాగస్వాములు ఐదుగురితోపాటు మొత్తం ఎనిమిది మందిపై కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గండిచెరువు సమస్యకు దారేదీ..!

- చెరువు నిండితే పొలాల దారి మాయం
- ఐదువందల ఎకరాల్లో పంటలను వదిలేసిన రైతులు
- నాలుగేళ్ల కిందట కొంతమేర మరువ తొలగింపు
- దీంతో చెరువులో నీరు వృథా
- నష్టపోతున్న ఆయకట్టు రైతులు
- తగ్గిన భూగర్భ జలాలు
- నాటి వైసీపీ పాలకుల నిర్లక్ష్యం

గాండ్లపెంట, సెప్టెంబరు 20 : మండలంలో చెరువు గండిచెరువు సమస్యలకు నిలయంగా మారింది. 2021లో భారీగా వర్షాలు కురిసినప్పుడు ఈ చెరువు నిండి బ్యాక్ వాటర్ వేపలకుంట గ్రామంలోకి చేరాయి. అంతేకాకుండా వేపలకుంట, సోమయాజులపల్లి పల్లెలకు చెందిన రైతులు పొలాలు సుమారు 500 ఎకరాలు ఈ చెరువుకు అటు వైపు ఉన్నాయి. చెరువు నిండటం వల్ల ఆ పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. దీంతో ఆ పంటలను వారు వదిలేసి.. తీవ్రంగా నష్టపోయారు. నాడు తాత్కాలికంగా మరువను నాలుగు అడుగుల మేర కొట్టేశారు. నీరు తగ్గిన తర్వాత మరువను నిర్మాస్తామని, వేపలకుంట గ్రామంలోకి నీరు రాకుండా గోడలు నిర్మిస్తామని, చెరువు అటు వైపు ఉన్న పొలాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని 2021లో నాటి ఎమ్మెల్యే ఎమ్మెల్యే సిద్ధారెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం ఆ హామీని పట్టించుకోలేదు. దీంతో వర్షాలు వచ్చినప్పుడల్లా ఇటు పొలాలకు దారి లేక.. అటు చెరువులో నీరు నిల్వ లేకుండా పోతోంది. వర్షాలు వచ్చినప్పుడల్లా నీరు వృథా అవుతోంది. ఈ చెరువులో నీరు ఉంటే చుట్టుపక్కల బోర్లలో నీటి మట్టం బాగా ఉండేది. అయితే ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గాయి. దీంతో ఆయకట్టు, చుట్టుపక్కల గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నాటి వైసీపీ పాలకుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపంగా మారింది.





చెరువు నిండటంతో నీటిలోనే వస్తున్న రైతులు (ఫైల్) మరువ తొలగించిన దృశ్యం (ఇన్‌సెట్‌)

నివేదికలు పంపాం

గండిచెరువు అటు వైపు ఉన్న భూములకు రహదారి కోసం ప్రణాళికలు తయారు చేసి, ఉన్నతాధికారులకు పంపాము. నిధులు మంజూరైన వెంటనే రహదారి పనులు చేపడాం.

\- అరుణకుమారి, ఇరిగేషన్ జేఈ

మా పొలాలకు దారి లేదు



నాకు గండి చెరువు అటువైపున 10 ఎకరాల పొలం ఉంది. వర్షాకాలంలో చెరువు నిండితే పొలానికి వెళ్లడానికి రస్తా లేదు. నేను ఎలా పంటలు సాగు చేయాలో అర్థం కావడంలేదు. పండించిన పంటలను కూడా ఇటు వైపు తెచ్చుకోవడానికి కష్టంగా ఉంది. పలుమార్లు నాయకులకు, అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదు.

\- నారాయణరెడ్డి రైతు, వేపలకుంట

సాగుకు దూరం



గండిచెరువు అటువైపు నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. చెరువు నిండితే అటువైపు వెళ్లి పంటలు సాగు చేయలేం. ఉన్న పొలం వదలలేక చెరువులోనే వెళ్లి పంటలు సాగుచేసుకుంటున్నా. తనతో పాటు మరికొంతమంది రైతులు ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రానున్న వర్షాకాలంలో అయినా తమ పొలాలకు రస్తా కల్పించాలి.

\- సోమశేఖర్, రైతు, వేపలకుంట

భూగర్భ జలాలు తగ్గాయి



గండిచెరువు మరువను నాలుగేళ్ల క్రితం కొంతమేర కొట్టేశారు. దీంతో నీటి నిల్వ చాలా తగ్గింది. గతంలో భూగర్భ జలాలు బాగా నిల్వ ఉండేవి. రెండు.. మూడు పంటలు తీసే వాళ్లం. ప్రస్తుతం బోర్లలో నీటి మట్టాలు తగ్గాయి. ఒక పంటను కూడా సరిగా తీయలేకపోతున్నాం. కొట్టేసిన మరువను తిరిగి నిర్మించాలి.

\- రమణారెడ్డి, రైతు, కట్టివారిపల్లి

సార్లూ... దయచూపండి..!

- ఆన్‌లైన్‌లో భూమి ఇతరులకు ..
- న్యాయం కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణ
- కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతులు
- అయినా పరిష్కారం కాని సమస్య
- ఉప్పునేసినపల్లి ఎరికల పుల్లమ్మ వ్యథ

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 20 : తమ భూమిని రెండేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో ఇతరుల పేర్ల మీదకు మార్చారని.. మళ్లీ తన పేరు మీదకు మార్చి న్యాయం చేయాలని ఉప్పునేసినపల్లి ఎరికల పుల్లమ్మ అధికారులను ఏడాదిపైగా వేడుకుంటోంది. శుక్రవారం స్థానిక తహసీల్దార్ ఎదుట తన ఆవేదనను ఇలా వ్యక్తం చేసింది. ' మాది ఉప్పునేసినపల్లి గ్రామం. చిగిచెర్ల గ్రామపొలంలో 176-4 సర్వేనెంబర్‌లో రెండు ఎకరాల భూమిని 30 సంవత్సరాల క్రితం ల్యాండ్ సీలింగ్‌లో నా భర్త ఎరికల క్రిష్టయ్య పేరు మీద డిపట్టా ఇచ్చారు. అయితే అప్పటి నుంచి వెబ్‌ల్యాండ్ నందు ఆన్‌లైన్‌లో తమపేరు మీద భూమి ఉందన్నారు. అయితే మాకు తెలియకుండా రెండేళ్ల క్రితం మా భూమిని రాహుల్‌రెడ్డి, చైతన్యరెడ్డి పేర్లమీద ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని తీవ్ర అన్యాయం చేశారు. వారిపేర్లు ఆన్‌లైన్‌లో తొలగించి మాకు న్యాయం చేయాలని సంవత్సరం నుంచి కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్ల అరిగేలా తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మా భూమిపై బ్యాంకులో రుణం తీసుకున్నాం. ఇప్పటికే బ్యాంకు నుంచి నోటీసులు కూడా వచ్చాయి. అయితే ఆన్‌లైన్‌లో భూమి లేకపోవడంతో బ్యాంకులో రెన్యువల్ కావడం లేదు. దీనిపై మీ కోసం స్పందనలో కూడా ఫిర్యాదు చేశా. అయిన ఇంతవరకు న్యాయం జరగలేదు. అధికారులు దయ చూపి నా సమస్యను పరిష్కరించండి.. ' అని వేడుకుంటోంది.



తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితురాలు ఎరికల పుల్లమ్మ

విచారణ చేస్తున్నాం: నటరాజ, తహసీల్దార్

చిగిచెర్ల గ్రామ పొలంలో 176.4 సర్వే నెంబరులో ఎరికల కృష్ణయ్య పేరు మీద ఉన్నభూమి ఇతరులకు మారిందని బాధితులు మీ కోసంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తున్నాం. ఇరువురిని పిలిపించి విచారణ చేసి తగు న్యాయం చేస్తాం.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం, సెప్టెంబరు 20 : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-19 విభాగం బాలుర ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన షూటింగ్ బాల్, టేబుల్ టెన్నిస్ విభాగంలో ప్రతిభచాటారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో అనంతపురంలో గురువారం జరిగిన టేబుల్ టెన్నిస్ విభాగం ఎంపిక పోటీలో పవన్‌కుమార్, మంగళవారం నిర్వహించిన షూటింగ్‌బాల్ విభాగంలో చరణ్‌కుమార్ ప్రతిభచాటారు. విజయవాడలో శనివారం జరిగే టేబుల్ టెన్నిస్ పోటీల్లో పవన్‌కుమార్, త్వరలో కర్నూల్‌లో జరిగే షూటింగ్ బాల్ పోటీల్లో చరణ్‌కుమార్ పాల్గొంటారు.



క్రీడల్లో ప్రతిభచాటిన పవన్‌కుమార్, చరణ్‌కుమార్

వరద బాధితులకు విరాళాల సేకరణ

కదిరి, (అమడగూరు), సెప్టెంబరు 20 : విజయవాడ వరద బాధితుల కోసం మండలంలోని మహ్మదాబాద్ శ్రీరామక్రిష్ణ విద్యానికేతన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం విరాళాలు సేకరించారు. విరాళంగా వచ్చిన మొత్తం రూ.9,600 సీఎం రిలీఫ్ పండ్‌కు పంపినట్లు కరస్పాండెంట్ కె.భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తుమ్మలమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవా

తనకల్లు : స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం మొక్కలు నాటారు. ఇందులో గ్రామ కార్యదర్శి చంద్రనాయక్, సచివాలయ సిబ్బంది, జనజాగృతి వలంటీర్ వెంకటేష్ పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయానికి స్థల పరిశీలన

పుట్టపర్తి : జిల్లా కేంద్రంలో మునిసిపల్ కార్యాలయ నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఎనుమలపల్లి గణేష్ కూడలి సమీపంలోని షాదిమహల్ వెనుక ఉన్న గుట్టప్రాంతాన్ని వారు మునిసిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. వారి వెంట టీడీపీ నాయకులు సుడా మాజీ చైర్మన్ కడియాల సుధాకర్ నాయుడు, మహమ్మద్‌రఫీ, మనోహర్, షామీర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఓబుళదేవరచెరువు : మండలంలోని మామిళ్లకుంటపల్లి, ఓడీసీ బీసీ కాలనీలో బాధిత టీడీపీ కార్యకర్త కుటుంబాలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. స్థానిక బీసీ కాలనీకి చెందిన షబ్బీర్ తల్లి మరణించడంతో ఆమె మృతదేహానికి నివాళ్లు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మామిళ్ల కుంట్లపల్లిలో ఆనంద్ కుమారుడు ఇటీవల మరణించాడు. ఆ కుటుంబాన్నీ వారు పరామర్శించారు.

'ఇది మంచి ప్రభుత్వం'.. శ్రీకారం

కదిరి, (అమడగూరు), సెప్టెంబరు 20: అమడగూరు మండలంలోని పూలకుంటపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పింఛన్ రాని అర్హులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, కన్వీనర్ గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ క్రిష్ణమూర్తి, నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

ధర్మవరం : పట్టణంలోని 25వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, సచివాలయ అడ్మిన్ సాయి ప్రకాశ్, సిబ్బంది, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, గడ్డంసూరి, క్లస్టర్ రామాంజి, అంకన్న, రవి, కేశవ పాల్గొన్నారు. అలాగే శాంతినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కూటమి నాయకులు కమతం కాటమయ్య, పరిశే సుధాకర్, పణికుమార్, కేశగాళ్ల శీన, మాధవరెడ్డి, హరీశ్, రాజారెడ్డి పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్ : ఏలుకుంట్ల గ్రామంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మండల స్పెషలాఫీసర్ దామోదర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోపూరి రామ్మోహన్, గుత్తా సూర్యనారాయణ, తిరువీధుల సుధాకర్, పురుషోత్తం, వనం చిన్నపుల్లప్ప, చాంద్‌బాషా, పూజరప్ప, పంచాయతీ సెక్రటరీ చంద్ర, వెల్ఫేర్ రవి, డిజిటల్ అసిస్టెంట్ రవి, ఏఎన్ఎం లక్ష్మీ, ఇంజనీర్ రమణ పాల్గొన్నారు.

కదిరి : పట్టణంలోని 20వ వార్డులోని కరణాల వీధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు : ఎంపీడీఓ శకుంతల, సచివాలయ కార్యదర్శి వసుంధర ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, సచివాలయ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాండ్లపెంట : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ఎస్సీకాలనీలో ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి బాషా, ఎంపీడీఓ కార్యాలయ, సచివాలయ సిబ్బంది, నాయకులు ఆక్రమ్‌బాషా, సికిందర్, బావాసాబ్, మునాఫ్ పాల్గొన్నారు.

నంబులపూలకుంట : ఇది మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీడీఓ మనోహర్‌బాబు, కార్యదర్శులు రమేష్, ముబారక్, రెడ్డి భాస్కర్ మండల కేంద్రంలో నిర్వహించారు. ఇందులో కార్యాలయాల సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండల కేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ.. కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిమనోహర్, పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి చేసిన అభివృద్ధిని వివరించారు.





ధర్మవరంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు, సచివాలయ సిబ్బంది   ఏలుకుంట్లలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

క్లుప్తంగా..

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ధర్మవరం, సెప్టెంబరు 20 : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు ఆరు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో-కన్వీనర అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. వేతనాలు అందక కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

పౌష్టికాహార వారోత్సవాలు

నల్లచెరువు, సెప్టెంబరు 20: స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో వెలుగు ఏపీఎం రవీంద్ర, ఐసీడీఎస్ సీడీపీఓ గంగరత్నమ్మ, మండల కన్వీనర్ పి. రాజశేఖర్, సర్పంచ్ పంచరత్నమ్మ, కో-కన్వీనర్ నాగిరెడ్డి, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ఆంజనప్ప, మాజీ సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

నల్లచెరువు, సెప్టెంబరు 20 : ఉపాధి హామీ పనులపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీడీ రమేష్‌బాబు ఉపాధి టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లుతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని మండలాల కంటే నల్లచెరువు మండలం ఉపాధి పనుల్లో చాలా వెనకబడి ఉందన్నారు. కూలీల సంఖ్య పెంచాలన్నారు. మండలంలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం అధికం చేయాలన్నారు. కూలీలకు బిల్లులు చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శకుంతలు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 20 : స్థానిక జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని 13 పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. 98 మంది బాలికలు, 115 మంది బాలురు నియోజకవర్గ పోటీలకు ఎంపికైనట్లు పీడీ గోపినాథ్ తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

బత్తలపల్లి, సెప్టెంబరు 20 : టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ జన్మదినం సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్కే ఫంక్షన్ హాల్లో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. అధిక సంఖ్యలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రక్షక తడులు ఇవ్వండి

తనకల్లు, సెప్టెంబరు 20 : ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో ఆర్‌డబ్ల్యూఎ ప్రాజెక్టులో సాగుచేసిన వివిధ రకాల పంటలు వర్షాభావం వలన ఎండు దశకు చేరుకుంటున్నాయని జనజాగృతి అధ్యక్షుడు బలరాం పేర్కొన్నారు. సంబంధిత సిబ్బంది, గ్రామ కమిటీలు, గ్రామస్థులు ఆ పంటలకు రక్షక తడులు ఇచ్చే కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలన్నారు. శుక్రవారం మండలంలోని ఆర్‌డబ్ల్యూఎ ప్రాజెక్టు ప్రాంతాలో సాగుచేసిన పంటలను ఆయన పరిశీలించారు. మండలంలోని కొత్తకురవపల్లి గ్రామంలో సాగుచేసిన సజ్జ పంటకు రక్షకతడులు ఇవ్వడానికి బోర్లున్న రైతులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రైతులందరూ తమ తమ బోర్ల నుంచి పక్కనున్న రైతులకు రక్షక తడులు ఇచ్చేలా కృషి చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

కదిరి అర్బన్ : స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా కుమ్మరవాండ్లపల్లి సచివాలయంలో పారిశుధ్య కార్మికులను శుక్రవారం సన్మానించారు. ఇందులో లీడ్ బ్యాంక్ మేనేజర్ కిరణ్‌కుమార్ డిక్కీ రాయలసీమ కో-ఆర్డినేటర్ రమణ, ఆర్థిక అక్షరాస్యత జిల్లా కో-ఆర్డినేటర్ వీర మారుతి పాల్గొన్నారు.

నేడు కళాశాల ప్రారంభోత్సవం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 20 : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, ఎంపీ బికె. పార్థసారధి శనివారం ప్రారంభిస్తున్నట్లు కన్వీనర్ శెట్టివారం జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుళరెడ్డి ఓప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్‌జేడీ, డీఈఓ హాజరుతారన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

నంబులపూలకుంట, సెప్టెంబరు 20: మండలంలోని పంచాయతీ కేంద్రమైన తిమ్మమ్మ మార్రిమానులో హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని బీజేపీ నాయకుడు జయరాములు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ నరేంద్ర కుమారుకు వినతిపత్రం అందచేసిన ఆయన మాట్లాడారు. గ్రామానికి దగ్గరలో ఇసుక భూములున్నాయని, మృతదేహాన్ని పూడ్చిపెడితే అడవి జంతువులు తవ్వేస్తున్నాయని అన్నారు. కావున గ్రామానికి దూరంగా గట్టి నేలను శ్మశానవాటికకు స్థలంగా కేటాయించాలని కోరారు.

తహసీల్దార్‌గా నీలకంఠారెడ్డి

కొత్తచెరువు, సెప్టెంబరు 20 : కొత్తచెరువు తహసీల్దార్‌గా నీలకంఠారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ నాగరాజు రాయదుర్గం బదిలీ అయ్యారు. దీంతో అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న నీలకంఠారెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సీజనల్ వ్యాధులపై సర్వే

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 20 : మండలంలోని పెడపల్లిలో సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యం తదితర వాటిపై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నగేష్ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీ రాధ, ఆరోగ్యకార్యకర్తలు, ఆశాకార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు జ్ఞాపికను అందచేస్తున్న పూర్వ విద్యార్థులు

నల్లమాడ, సెప్టెంబరు 20 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023-24లో పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సహకాలు అందించారు. అదే పాఠశాలలో 1991-92లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు వీటిని అందజేశారు. ప్రథమ బహుమతి ఎస్ సందీప్‌కు గోపాల్‌రెడ్డి రూ.పదివేలు, ద్వితీయ బహుమతి జ్యోతికి చంద్రహాస్‌రెడ్డి రూ.6 వేలు, తృతీయ బహుమతి నరేష్‌కు సలాంఖాన్ రూ.5 వేలు, నాల్గో బహుమతి చరణ్‌కు చదివే వెంకటనారాయణ రూ.3 వేలు అందించారు.

పంటలను పరిశీలించిన కలెక్టర్

పుట్టపర్తి రూరల్: మండలంలోని జగరాజుపల్లిలో రైతులు హరివర్ధన్‌రెడ్డి, రవీంద్రారెడ్డికి చెందిన అరటి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం పరిశీలించారు. ఆ రైతులతో మాట్లాడారు. నాలుగు నెలల క్రితం పండిన అరటి పంటను పులివెందులకు చెందిన నాగార్జునరెడ్డికి అమ్మి దళారుల చేతుల్లో మోసపోయామని రైతు హరివర్ధన్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అతనిపై తనకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, అతనిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆ రైతుకు భరోసా ఇచ్చారు. అరిటి, మొక్క జొన్న పంటలను అమ్ముకోవడానికి జిల్లాలో మార్కెట్ సదుపాయం కల్పించాలని రైతుసంఘం నాయకుడు లక్ష్మినారాయణరెడ్డి కలెక్టర్‌ను కోరారు. వారి వెంట ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్, ఎపీఎంఐపీ అధికారి సుదర్శన్, జైన్ కంపెనీ ప్రతినిధి రామానాయుడు, రైతులు రైతుసంఘం నాయకులు ఉన్నారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

క్రైం న్యూస్

హత్యకేసులో నిందితుల అరెస్టు

కొత్తచెరువు, సెప్టెంబరు 20 : స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఈ నెల 11న బూచర్ల గంగాద్రి హత్యకు గురైన విషయం తెల్సిందే. ఈ హత్య కేసులో ముగ్గురు ముద్దాయిలను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కొత్తచెరువు బోయవీధిలో నివాసముంటున్న లక్ష్మీదేవి అలియాస్ భారతి పట్ల భూచర్ల గంగాద్రి అగౌరవంగా ప్రవర్తించేవాడు. దీంతో విసుగుచెందిన భారతి గోరంట్లలోని తన బంధువులు నరసింహప్ప గారి రత్నమ్మ, శంకర్‌రెడ్డికి విషయం చెప్పింది. ఈ ముగ్గురు కలిసి ఈ నెల 11న గంగాద్రిని స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో కట్టెలతో కొట్టి హత్యచేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు ఈ ముగ్గురు నిందితులను స్థానిక మార్కెట్‌లోని సచివాలయం వద్ద శుక్రవారం అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరు పరచి రిమాండ్ తరలించినట్లు అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఇందిరా తెలిపారు. కేసును చేధించిన పోలీసులను రివార్డుకు ఎంపిక చేశామన్నారు.

మహిళ ఆత్మహత్యకు కారకుడి ...

కదిరి, సెప్టెంబరు 20 : పట్టణంలోని ఖాజానగర్‌లో ఈ నెల17న హసీనా ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన ఖజానగర్ వాసి షేక్ ఇర్షాన్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. హసీనా కుమార్తె సాహీన. ఈమెకు వివాహమై పిల్లలు ఉన్నారు. సాహీన విషయమై షేక్ ఇర్షాన్‌తో హసీనా గొడవపడింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన హసీనా విషద్రావకం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు షేక్ ఇర్షాన్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తచెరువు, సెప్టెంబరు 20 : స్థానిక హంద్రీనీవా కాలువ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తచెరువు వాసి కురుబ రాజు గాయపడ్డాడు. ఇతను శుక్రవారం పుట్టపర్తి నుంచి బైక్‌లో కొత్తచెరువుకు వస్తూ ఎదురుగా వచ్చిన కారును ఢీకొన్నాడు. గాయపడిన రాజును స్థానికులు కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

వ్యవసాయ సామగ్రి చోరీ

నల్లమాడ , సెప్టెంబరు 20 : మండలంలోని బాసమవారిపల్లి రైతు జనార్ధన్‌యాదవ్‌కు చెందిన పొలంలోని 15 స్ప్రింకర్లు, 30 పైపులు, డ్రిప్ పైపులు గురువారం రాత్రి చోరీ అయ్యాయి. వాటి విలువ దాదాపు రూ. రెండు లక్షలని, ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశామని శుక్రవారం చెప్పారు.

విశ్వకర్మయోజనను సద్వినియోగం చేసుకోండి

కదిరి అర్బన్, సెప్టెంబరు 20: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మయోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి పేర్కొన్నారు. శుక్రవారం ఈ పథకం కింద శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చేతి, కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారిలో సామర్థ్యం మెరుగుపరచి, ఉత్పాదకత నాణ్యత, ఉత్పత్తులను పెంచడమే ఈపథకం ఉద్దేశమన్నారు. ఈ పథకంలో చేరడం వలన విశ్వకర్త సర్టిఫికెట్, ఐడీ కార్డుతోపాటు నైపుణ్యత పొపెందించుకోవడానికి కావలసిన శిక్షణ, టూల్ కిట్లు, రుణ సదుపాయం, మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రభుత్వం మద్దతు లభిస్తుందన్నారు. 18 సంవత్సరాలు పైబడిన కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులన్నారు. విద్యార్హత లేకున్నా, పేర్లు నమోదు చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌బాబు, హసనాపురం చంటి, క్రిష్ణవేణి, మేనేజర్ ధనుంజయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పార్థసారథి

శ్మశాన వాటికకు స్థల పరిశీలన

కొత్తచెరువు, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలో శ్మశాన వాటికకు స్థలాన్ని తహసీల్దార్ నాగరాజు శుక్రవారం పరిశీలించారు. శ్మశాన వాటిక లేకపోవడంతో చెరువు, కాలువ గట్లపై దహన సంస్కారాలు నిర్వహించేవారు. శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని టీడీపీ నాయకులు, జనతా సొసైటీ సభ్యులు పలు మార్లు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు తహసీల్దార్ నాగరాజు శుక్రవారం పుట్టపర్తి ప్రధాన రహదారి పక్కన 1424 సర్వేనెంబరులో నల్లగుట్ట సమీపంలో శ్మశాన వాటికకు స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే స్థలాన్ని సర్వేచేసి పంచాయతీకి అప్పజెపుతామని తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించారని, వారికి నోటీసులు అందించి శ్మశాన వాటికకు స్థలాన్ని సేకరిస్తామన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

పనిసర్దుబాటులో లోపాలను సరిచేయండి

కొత్తచెరువు: సత్యసాయి జిల్లాలో పనిసర్దుబాటులో జరిగిన లోపాలను పరిష్కరించాలని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్ విద్యాశాఖ ఏడీ నాగరాజుకు శుక్రవారం సాయంత్రం వినతిపత్రం అందచేశారు. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో 169 మంది విద్యార్థులు ఉన్నారని, నిబంధనల ప్రకారం అక్కడ ఒక పీఎస్ హెచ్‌ఎం, ఐదుగురు ఎస్జీటీ ఉపాధ్యాయులు ఉండాలని అన్నారు. అయితే సర్దుబాటు జరిగిన తర్వాత పది మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, ఇది ఎలా సాధ్యమని వారు ప్రశ్నించారు. ఇలాంటి తప్పిదాలు చాలా పాఠశాలల్లో ఉన్నాయని, వాటిని సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, బాబు, సంతోష్, బాబావళి, సంతోష్ పాల్గొన్నారు.



రొద్దంలో క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ పార్థసారథి

ఉపాధ్యాయులు వల్లే ఈ స్థాయికి ఎదిగా

● క్రీడాపోటీలు ప్రారంభించిన ఎంపీ బీకే పార్థసారథి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 20: ఉపాధ్యాయులు చెప్పిన విద్యాబుద్ధులవల్లే తాను ఈరోజు ఇంతస్థాయికి ఎదిగానని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం రొద్దం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ముందుగా విద్యాశాఖాధికారులు పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎంపీ వాలీబాల్ ఆడారు. ఎంపీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ఆసక్తి కనబరచాలన్నారు. తాము చదువుకున్నరోజుల్లో ఉపాధ్యాయులు చెప్పిన విద్య వల్లే జడ్పీ ఛైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీగా ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందన్నారు. విద్యార్థులు విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, నిధులు మంజూరు చేయాలని ఎంపీని ఉపాధ్యాయులు కోరారు. పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ: రొద్దం మండలం పెద్దగువ్వలపల్లికి చెందిన టీడీపీ నాయకుడు ఈడిగ చిన్నప్పయ్య తమ్ముడి కుమారుడు ప్రమోద్ శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ గ్రామానికి చేరుకుని ప్రమోద్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి సంతాపం తెలిపారు.

జగన్‌రెడ్డిని దేశం నుంచి బహిష్కరించాలి

బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుమూర్తి



రొళ్ల, సెప్టెంబరు 20: కలియుగ వైకుంఠంగా భావించి తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మీద కఠిన చర్యలు తీసుకొని భారతదేశం నుంచే బహిష్కరించాలని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వందల సంవత్సరాల నుంచి తిరుమల శ్రీవారి సన్నిధిలో అత్యంత పవిత్రంగా, ఆగమ శాస్త్రానుసారంగా పూజాకైంకర్యాలు జరుగుతున్నాయన్నారు. గత ఐదు సంవత్సరాల్లో జగన్‌రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం తిరుపతి పవిత్రతను నాశనం చేసిందని మండిపడ్డారు. చివరికి శ్రీవారి భక్తుల అత్యంత భక్తి భావాలతో ఆరగించే లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపిన కల్తీ నెయ్యి ఉపయోగించి ప్రపంచంలోని కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని తెలిపారు. ఇది అత్యంత క్రూరమైన, నీచాతి నీచమైన నేరం అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెంటనే అత్యున్నత విచారణకు ఆదేశించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీ నాయకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి



సమావేశమైన సచివాలయ ఉద్యోగులు

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 20 : శాసనకోట సచివాలయ ఉద్యోగి పవన్‌కుమార్‌రెడ్డిపై ఫోన్ ద్వారా దుర్భాషలాడిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శాసనకోట వెంకటేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పరిగి-2 సచివాలయంలో సమావేశం ఏర్పాటుచేశారు. అనంతరం తహసీల్దార్ హసీనా సుల్తానా, ఎస్ఐ రంగడు యాదవ్‌ను కలిసి సచివాలయ ఉద్యోగిని ఫోన్‌లో బెదిరించిన వ్యక్తిపై చర్యలు తీసుకుని బలమైన కేసు నమోదు చేయాలంటూ విన్నవించారు. సచివాలయ ఉద్యోగస్థులు ఎలాంటి బెదిరింపులకు భయపడకుండా ఉద్యోగం చేసుకోవాలన్నారు. నాయకుల ద్వారా బెదిరింపు కాల్ వస్తే తమ దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారుల వద్దకు సమస్యను తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టం కలిగించొద్దు



తూకాలను పరిశీలిస్తున్న రైతు సంఘం, బీజేపీ నాయకులు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 20: ఆరుగాలం కష్టపడి చమటోడ్చి పంటలను పండించిన రైతులకు మార్కెట్‌లో నష్టం జరుగకుండా చూడాలని రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, సిద్దారెడ్డి, బీజేపీ నాయకుడు రమేషరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వారు హిందూపురంలోని మార్కెట్ యార్డును పరిశీలించారు. మార్కెట్‌లో ప్లాస్టిక్ సంచు లను నిషేధించాలన్నారు. సంచి 400 గ్రాములు ఉంటుందని, ఒక కిలోని తూకంలో తీసి వేస్తున్నారని ఆగ్రహించారు. అదే విధంగా హమాలీలు రైతుల దగ్గర డబ్బు రూపంలో తీసుకోవాలి కానీ వస్తురూపంలో తీసుకోకూడదన్నారు.

రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అగళి, సెప్టెంబరు 20: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని అగళి ప్రాథమిక వైద్యాధికారి శివానంద పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత లేకపోవడం, మురుగునీరు అధికంగా ప్రవహిస్తూ ఉండటంతో రోగాలు అధికంగా వచ్చే అవకాశం ఉందని, అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వంద మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హిందూపురం (సోమందేపల్లి), సెప్టెంబరు 20: సోమందేపల్లి మండల కేంద్రం సాయినగర్ వద్ద శుక్రవారం ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వినాయకనగర్‌కు చెందిన బావబామ్మర్ది గురురాజ్, శ్రీరాములు పనిమీద బయటికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా బస్సును ఓవర్‌టెక్ చేస్తూ వచ్చిన ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులుతెలిపారు.

యువకుడిపై బంధువుల దాడి



గాయపడిన సురేష్

గోరంట్ల, సెప్టెంబరు 20: మండలంలోని బెల్లాలచెరువు గ్రామానికి చెందిన కొత్తమిద్ది సురేష్ అనే యువకుడిపై శుక్రవారం బంధువులు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు తెలిపిన సమాచారం మేరకు.. సురేష్ ఆటో నడిపేవాడు. అదే గ్రామానికి చెందిన సమీప బంధువైన యువతితో సన్నిహితంగా ఉండడంతో పలుమార్లు మందలించారు. మార్పు రాకపోవడంతో బెల్లాలచెరువు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న సురేష్‌పై దాడిచేసి కొట్టారు. రాడ్లతో కొట్టడంతో సురేష్ తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్సలు చేశారు. దాడి సంఘటనపై వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంస్ రాజు

మడకశిర రూరల్/హిందూపురం, సెప్టెంబరు 20: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజాపాలనకు వంద రోజులయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని మండలంలోని ఆమిదాలగొందిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో కలిసి ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలలో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంద రోజుల పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు తీయించారని అన్నారు. ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వ స్టిక్కర్లు, కరపత్రాలను ఇంటింటికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటిగా నెరవేర్చడం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో హిందూపురంలో పలువార్డుల్లో కూటమినాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చంద్రబాబు ఒక్కొక్కటే నెరవేరుస్తూ వస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, వెంకటేశ్, రాఘవేంద్ర, మంజుల, సతీష్, షఫీవుల్లా, అంజాద్, దేశాయ్ మురళి, నవీన్, నిమ్మకాయల రాము, 9వ వార్డులో టీడీపీ కౌన్సిలర్ దుర్గ మంజుల, నాయకులు ప్రసాద్, దుర్గ నవీన్, లింగప్ప, సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.



పురంలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

వందరోజుల పాలనపై ఇంటింటి ప్రచారం

గోరంట్ల/పెనుకొండరూరల్ సెప్టెంబరు 20: ఎన్డీయే కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై అధికారులు, నాయకులు గోరంట్లలోని పులేరు రోడ్డులో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మొదట సంత మార్కెట్ సచివాలయంలో ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, కూటమి నాయకులతో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 26వరకు ప్రతిరోజు ప్రజల వద్దకు వెళ్లి ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించి వంద రోజుల అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందచేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలని టీడీపీ, జనసేన మండల కన్వీనర్లు సోముశేఖర్, సంతోష్, నాగరాజు పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు సూర్యనారాయణ, నవీన్, నీరంజన్‌రెడ్డి కార్యదర్శులు బాబురావు, సౌమ్య, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మూడు నెలల్లో అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని నాయకులు అన్నారు. పెనుకొండ మండలం వెంకటగిరిపాళ్యంలో మాజీ ఎంపీపీ కేశవయ్య, శ్రీనివాసులు ఆధ్వర్యంలో, శెట్టిపల్లిలో మండల కన్వీనర్ సిద్దయ్య, ఇస్లాపురంలో మండల కన్వీనర్ శ్రీరాములుయాదవ్, కౌన్సిలర్ హనుమంతు, చంద్రగిరిలో లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.



గోరంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, కూటమి నాయకులు

620 కింటాళ్ల ఉలవల పంపిణీ: ఏడీ

మడకశిర,సెప్టెంబరు 20: ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ పంట సాగుచేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు వీలుగా 80 శాతం సబ్సిడీతో ఉలవ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమీనన్ తెలిపారు. శుక్రవారం వ్యవసాయ శాఖ ఏడీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు 1300 క్వింటాళ్ల ఉలవ విత్తనాలను కేటాయించామని, ఇప్పటి వరకు 620 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేశామన్నారు. 10 కిలోల విత్తనాల ప్యాకెట్ పూర్తి ధర రూ. 870 అని, అందులో 80 శాతం సబ్సిడీ రూ.696 పోను రైతు రూ. 174 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వర్షం పడిన తరువాత ఉలవ పంట సాగు చేసుకోవచ్చని తెలిపారు.

తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్ సమావేశం

పెనుకొండ, సెప్టెంబరు 20: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ సుదర్శన్ అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు మానవ విలువలు, నైతిక విలువలు పెంపొందించుకోవడం కోసం ప్రభుత్వ కళాశాలలో మాత్రమే బోధించగలరని, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల నడవడిక, ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి ఉంచి ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ బషీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

లేపాక్షి, సెప్టెంబరు 20: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఈఓఆర్డీ శివన్న తెలిపారు. శుక్రవారం పులమతి గ్రామంలో స్వచ్ఛతహీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని నీరు నిలువ లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటివాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 20: అమరాపురం మండలంలోని హలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి రాఘవయ్య మాట్లాడుతూ మన జాతీయ భాష అయిన హిందీ దేవ నగరి లిపి అని, విద్యార్థులు హిందీ బాగా నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈశ్వరప్ప, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పెనుకొండ, సెప్టెంబరు 20: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని టింబక్టిప్ కలెక్టివ్ సంస్థ కార్యనిర్వాహణ అధికారి కవిత పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కుమ్మరదొడ్డిలో ఉచిత న్యాయసదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కుటుంబం, సమాజంలో ఏవిధంగా మెలగాలనే విషయంపై అవగాహన కల్పించారు. అనంతరం నాటిక రూపంలో మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా శక్తి సీఈఓ రమేజ, ప్రోగ్రాం అసోసియేట్ రవళి, అధ్యక్షురాలు వెంకటలక్ష్మమ్మ, దుర్గాశక్తి పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

'మాపై బదిలీ ఒత్తిడి ఎందుకు?'

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 20: తమపై బదిలీల ఒత్తిడి ఎందుకు తెస్తున్నారని హిందూపురం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏ శ్రీనివాసరావును అడిగారు. శుక్రవారం ప్రాజెక్టు పరిధిలోని 8 మంది సూపర్‌వైజర్లు ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను కలిసి మాట్లాడారు. ఐసీడీఎస్‌లోని ఓ అధికారి మమ్మల్ని బదిలీ చేస్తున్నామని చెబుతున్నారన్నారు. రిమార్కులు లేకున్నా అనవసంగా బదిలీ ఎందుకు చేస్తున్నారని ఐసీడీఎస్ అధికారిని అడిగామన్నారని తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి తీవ్ర ఒత్తిడి ఉందని ఆ అధికారి తెలిపారని దీంతో మిమ్మల్ని కలవడానికి వచ్చామని తెలిపారు. తాము ఎవరినీ బదిలీ చేయాలని ఒత్తిడి చేయలేదన్నారు. మీమీ స్థానాల్లో పని చేసుకోవాలని ఆయన తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుడిబండ, సెప్టెంబరు 20: మండలంలోని జమ్ములబండ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వైద్యాధికారులు అనిల్‌కుమార్, శాంతి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్, ఉపాధ్యాయులు నాగేంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



కబడ్డీ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

మడకశిర రూరల్, సెప్టెంబరు 20: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని కల్లుమర్రి సర్పంచు గంగమ్మ పేర్కొన్నారు. మండలంలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడలు నిర్వహించారు. సర్పంచు క్రీడలను ప్రాంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణమోహన్‌రెడ్డి, క్రీడల సమన్వయ కర్త నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఎంపిక

హిందూపురం(సోమందేపల్లి): నియోజకవర్గ క్రీడా పోటీలకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో మండలస్థాయి క్రీడా పోటీలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారన్నారు. అందులో ప్రతిభ కనబరచి విజేతగా నిలిచిన వారిని నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు,

చిలమత్తూరు: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని ఎంఈఓలు పద్మప్రియ, సల్మాన్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొడికొండ ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల హెచ్ఎం గోపాలనాయక్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక టీడీపీ నాయకులు బాలాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆశక్తి చూపాలన్నారు. క్రీడా పోటీల్లో బాలుర విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటివి నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మోరార్జీయాదవ్, పీడీలు రామమూర్తినాయక్, మారుతీ ప్రసాద్, జయచంద్ర, నాగరాజు, రాజమ్మ, జయంతి పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న టీడీపీ నాయకుడు బాలా

వినియోగదారుల ప్రయోజనాలే ముఖ్యం

● ట్రాయ్ సభ్యురాలు శారద

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 20: టెలికాం సేవల్లో వినియోగదారుల ప్రయోజనాలే ట్రాయ్‌కు ముఖ్యమని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యురాలు శారద తెలిపారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన వినియోగదారుల సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారుల ప్రయోజనాల కోసం స్పీడప్ మై కాల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ యాప్‌ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. అలాగే మైకాల్ యాప్ ద్వారా కాల్ కనెక్టివిటి సమయాన్ని తెలుసుకోవచ్చన్నారు. బీఎస్ఎన్ఎల్ జీటీఏు ఉమాప్రసాద్ మాట్లాడుతూ తమ వినియోగదారులకు మరిన్ని సేవలు అందించడానికి కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాయ్ సభ్యురాలు శారద

సెల్ టవర్ ఏర్పాటు చేయండి : సెల్‌టవర్ ఏర్పాటు చేయాలని పెనుకొండ మండలం గోనిపేట గ్రామానికి చెందిన ప్రజలు ట్రాయ్ సభ్యురాలైన శారదను సోమందేపల్లిలో కలిసి వినతి పత్రం అందించారు. రెండువేల మంది జనాభా గ్రామంలో ఉన్నారన్నారు. సెల్‌టవర్ లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందించడానికి ఇబ్బందిగా మారిందన్నారు.

బిందుసేద్యాన్ని సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్



కోడూరు తోపు వద్ద దానిమ్మ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

చిలమత్తూరు, సెప్టెంబరు 20: ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న బిందు సేద్య పరికరాలను రైతులు సద్వినియోగం చే సుకోవాలని కలెక్టర్ చేతన్ సూచించారు. శుక్రవారం ఆయన చిలమత్తూరు మండలం కోడూరుతోపు వద్ద బిందు సేద్యంతో సాగవుతున్న దానిమ్మ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు ప్రభాకర్‌తో బిందుసేద్య పరికరాలు ఎలా ఉపయోగపడుతున్నాయి? వాటితో పంటకు ఎంత మేలు జరుగుతోంది? ఎన్ని ఎకరాల్లో పంట సాగవుతోంది? ఎంత వరకు లాభం వచ్చే అవకాశాలు ఉన్నాయనే విషయాలపై ఆరా తీశారు. ఏడాదిన్నర క్రితం పంటను నాటుకున్నానని, ఇప్పుడిప్పుడే పంట కోతకు వస్తోందని, తక్కువ నీటితోనే పది ఎకరాల్లో పంట సాగుచేస్తున్నట్లు రైతు వివరించాడు. రైతులు ఉద్యానవన పంటలపై మొగ్గు చూపాలని, అందుకు తగిన రాయితీలు, సాగులో మెలకువలు, సూచనలు ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ప్రీమియం డ్రిప్ ఇరిగేషన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే ఉత్తమ పాలన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 20: వంద రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా కనీవినీ ఎరుగని రీతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఉత్తమ పాలన అందించారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రఘువీరాచౌదరి పేర్కొన్నారు. శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని అల్విన్ కాలనీలో కరపత్రాలు పంచుతూ వంద రోజుల్లో చేసిన అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ శ్రీరాములు, రామలింగ, మాజీ వైస్ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను పరిశీలించిన అధికారులు



ఎస్సీ శ్మశానవాటిక రహదారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రెడ్డిశేఖర్, సీఐ శేఖర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోరంట్ల, సెప్టెంబరు 20: మండలంలోని పాలసముద్రం గ్రామంలో ఎస్సీ శ్మశానవాటికను తహసీల్దార్ రెడ్డిశేఖర్, సీఐ శేఖర్ శుక్రవారం పరిశీలించారు. పాలసముద్రం ఎస్సీకాలనీవాసి పెద్ద ఆంజనప్ప ఈనెల 16న మృతిచెందారు. శవాన్ని శ్మశానవాటికకు తరలించడానికి దారిలేక నడుములోతున్న చెరువు కాలువలో దిగి మహిళలు సైతం తంటాలు పడిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి 'అంతిమయాతన' శీర్షికన ప్రచురించింది. దీంతో ఉన్నతాధికారులు స్పందించారు. శ్మశానానికి వెళ్లే నీటి కాలువను పరిశీలించి స్థానికులతో అధికారులు చర్చించారు. చెరువు నీరు తగితే నెలరోజుల తరువాత కాలువ దాటడానికి దారి ఏర్పాటు చేయవచ్చని అధికారులు తెలిపారు. టీడీపీ నాయకులు చంద్ర, అన్వర్, జయచంద్ర అధికారులతో మాట్లాడారు. శ్మశానవాటిక 75 సెంట్లు ఉండగా ప్రస్తుతం కొంత స్థలం మాత్రమే ఖాళీగా ఉన్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలం కేటాయించడానికి చర్యలు చేపడతామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సోముశేఖర్‌రెడ్డి, సర్వేయర్ తాతయ్య, విలేజీ సర్వేయర్ నరేంద్ర, వీఆర్ఓ రమేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెనుకొండ, సెప్టెంబరు 20: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛతాహిసేవ ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ కాంతారావు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లేకార్డులు, బ్యానర్లు పట్టుకుని స్వచ్ఛభారత్ వర్థిల్లాలి, స్వచ్ఛతసేవ వర్థిల్లాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోనాపురం, మంగాపురం రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థి



విజయ్‌కుమార్

గుడిబండ, సెప్టెంబరు 20: గుడిబండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విజయ్‌కుమార్ శుక్రవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో మంచి ప్రతిభ కనబరచాడు. లాంగ్‌జంప్, హైజంప్, త్రోబాల్ అండర్-17 తదితర పోటీల్లో విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం గోవిందప్ప, పీడీ సాయిక్రిష్ణ, పీఈటీ అజారుద్దీన్ తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 20: అమరాపురం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం పంటకోత ప్రయోగాలపై ఏఎస్ఓ రమణానాయక్ అవగాహన కల్పించారు. పంట కోత ప్రయోగాలు జాగ్రత్తగా చేయాలని, వాటి ఫలితాల ఆధారంగానే దిగుబడి ఆధారిత ఇన్సూరెన్స్ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మంజునాథ్, ఏఈఓ అమర్‌నాథ్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అగళి, సెప్టెంబరు 20: మండలంలోని అల్లికెర ప్రాథమికోన్నత పాఠశాలను మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ రవిప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా విద్యార్థులు, పాఠశాల మౌళిక వసతులపై రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు విద్యాబోధన చేయాలన్నారు. వీరి వెంట ఏపీఓ శివన్న, ప్రధానోపాధ్యాయుడు మోహన్ పాల్గొన్నారు.